షైన్
సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల
డా॥ SK. మహమ్మద్ అలి
కన్సల్టెంట్ డెంటల్ సర్జన్

Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)
స్థాపితం: 1930
*Longest Living Newspaper in Telugu Journalism*

# జమీన్‌రైతు

సంపుటి: 80 • సంచిక: 40 • 18-9-2009 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

కేర్
సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల
MDS,
Asst. Professor Endodontics
నెల్లూరు - ఫోన్ : 2303300

● అధిష్ఠానం కూడా అంతే పట్టుదలతో వుంది.

# ఇవ్వకుంటే ఏమి చేస్తారు?

వైఎస్.జగన్ ముఖ్యమంత్రిత్వ కోలాహలం చప్పబడిపోతున్నది. తన తండ్రి శవం హైదరాబాద్ చేరకముందే ఆ గద్దె మీద కూర్చోవాలని మహా తాపత్రయపడింది జగన్ బృందం. నిజంగా జగన్‌కూ ఇంతే తొందర వుందో లేదో మనకైతే తెలియదు కానీ, ఆయన అనుచరులమని, వైఎస్ఆర్‌కు అభిమానులమని చెప్పుకొనేవారు మాత్రం శవ సంస్కారం వరకు కూడా ఆగలేమన్నట్లు ప్రవర్తించారు. అందులో ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా కలిసి వుండడం దురదృష్టం. అధిష్ఠానం అభిప్రాయం కూడా ఇదే అని మెల్లమెల్లగా అర్థమౌతున్నది. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మీద కాంగ్రెస్ పెద్దలందరికీ ఎంతో అభిమానం వుంది. ఆదరణ వుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని విజయపథంలో నడిపించిన నాయకుడిగా గౌరవ మన్ననలున్నాయి. అంతటి నేతకు ఇంతటి దయనీయ మరణం సిద్ధించడం పట్ల ఆవేదన వుంది. అయ్యోపాపం అన్న జాలి వుంది. ఆపుకోలేని దుఃఖం వుంది. సోనియాగాంధీ కూడా ఈ వార్త విని కళ్లనీళ్లు పెట్టుకొన్నాదంటే, వున్నతస్థాయిలో వైఎస్ఆర్ పట్ల వున్న ఆప్యాయత ఎంత గాఢమైనదో అర్థం చేసుకోవచ్చు.

- జగన్ అనుచరుల ఆగం నచ్చని అధిష్ఠానం.
- ఏదో ఒకటి చేయాలన్న తొందరలో జగన్.
- వద్దంటున్న కెవిపి.

కానీ ఆయన మరణం తర్వాత ఆయన కుమారుడి పేరిట ఆయన అనుచరులు చేస్తున్న అల్లరి, ఆగం మాత్రం కాంగ్రెస్ పెద్దలెవరికీ నచ్చడం లేదు. ఇష్టపడక పోవడమే కాదు, ఈ పోకడలను ఆసహ్యించుకొంటున్నారు కూడా.

జగన్‌ను ముఖ్యమంత్రి గద్దె మీద కూర్చోబెట్టడం తన మిత్ర ధర్మమనే లక్ష్యంతో కెవిపి రామచంద్రరావు ఢిల్లీలో అందరినీ ప్రాధేయపడ్డాడు. ప్రధాని మన్మోహన్‌సింగ్, సోనియాగాంధీ, ప్రణబ్ ముఖర్జీ, అహ్మద్ పటేల్, దిగ్విజయ్ సింగ్, జైపాల్‌రెడ్డి, వీరప్ప మొయిలీ, చిదంబరం వంటి నేతలందరినీ ఒకటికి నాలుగుసార్లు కలిసి విన్నవించాడు. అయితే ఆయనకు వారి నుంచి ఎటువంటి స్పందనా ఎదురు కాలేదు. జగన్‌ను ముఖ్యమంత్రి చేయడాన్ని వారు ఔనంటున్నారో, కాదంటున్నారో కూడా అర్థం కాలేదు. రాజకీయ చాణక్యం నెరపడంలో అపర కౌటిల్యుడన్పించుకొన్న కెవిపి రామచంద్రరావు, కాంగ్రెస్ అధిష్టానం అంతరంగాన్ని పసిగట్టడంలో ఏ మాత్రం సఫలం కాలేకపోయాడు. తిరిగి తిరిగి కాళ్ల నొప్పులు తప్ప వచ్చే ఫలితమేదీ లేదనే నిరాశతో హైదరాబాద్ తిరిగి వచ్చేశారాయన.

జగన్ ముఖ్యమంత్రిత్వం కోసం మా ప్రాణాలిస్తామని బీరాలు పలుకుతుండిన మంత్రులు, ఎమ్మెల్యేలకు ఇప్పుడేమి చేయాలో పాలుపోవడం లేదు. కొండా సురేఖ, మల్లు భట్టివిక్రమార్క వంటి వీరవిధేయులు కొందరుమాత్రం ఇప్పటికీ అదే ధోరణిలో మాట్లాడుతున్నప్పటికీ, ముప్పాతిక భాగం మంత్రులు, ఎమ్మెల్యేలు చల్లగా సర్దుబాటుకు దారులు వెతుక్కుంటున్నారు. ఎక్కువ మాట్లాడితే అధిష్టానం కళ్లు తమ మీద పడతాయన్న భయంతో తల్లడిల్లిపోతున్నారు. కెవిపి రామచంద్రరావు వారికి ఇస్తున్న సలహా కూడా అదే.

కాంగ్రెస్ అగ్రనాయకత్వాన్ని ధిక్కరించి మనం చేయగల్గింది ఏదీ లేదు. కనీసం కొన్నిరోజుల పాటైనా మనం ఓపిక పట్టి వేచి



చూద్దాం. వారంతటవారు పిలిచి పదవి ఇచ్చే వరకు సహనం చూపుదాం. ఈ లోపల ఎవరూ ఏమీ మాట్లాడవద్దు. సిఎల్పీ సమావేశం అసలే వద్దు. దీక్షలు, ధర్నాలు చేయవద్దని సలహా ఇస్తున్నాడు కెవిపి. మీరు చేసే అల్లరి వల్ల జగన్‌కు మేలు కంటే కీడే ఎక్కువగా

కొరవ 14వ పేజీలో



# [ పీకి పారేయాలి! ]

కేంద్ర విదేశాంగ సహాయమంత్రి శశిథరూర్ ఉన్నత విద్యావంతుడు. దౌత్య వృత్తిపరంగా అత్యున్నత శిఖరాలు అధిరోహించిన ప్రతిభావంతుడు. ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ స్థానానికి కోఫీ అన్నన్‌తో పోటీ పడి, కొద్ది తేడాతో ఓడిపోయిన విఖ్యాతుడు. న్యూయార్క్ టైమ్స్, టైమ్, న్యూస్‌వీక్ వంటి ప్రపంచ ప్రసిద్ధ ఆంగ్ల దినపత్రికలలో అసంఖ్యాకమైన వ్యాసాలు వ్రాసిన రచయిత. మహా గొప్ప మేధావిగా పేరు. అందువల్లనే ఆయన అడిగీ అడగగానే సోనియాగాంధీ ఆయనకు కేరళ నుంచి ఎమ్పీగా పోటీ చేయడానికి టిక్కెట్ ఇచ్చింది. గెలిచిన వెంటనే విదేశాంగ మంత్రిత్వం ఇచ్చింది.

భారతదేశ విదేశాంగ విధానంపైన సాధికార గ్రంథాలు రచించి, ఐక్యరాజ్య సమితిలో అత్యున్నత హోదాలో ముప్పైయేళ్లపాటు పనిచేసిన ఒక దౌత్య మేధావి విదేశాంగ మంత్రి పదవి చేపడితే, దానివల్ల దేశానికి ఎనలేని మేలు జరుగుతుందన్నది ఎవరికైనా కలిగే అభిప్రాయం. కానీ శశిథరూర్ అందరి అంచనాలను, అందరి ఆశలను వమ్ము చేసే తీరులో ప్రవర్తిస్తున్నాడు. కేంద్రమంత్రిగా పదవి చేపట్టిన తర్వాత ఆయన మంత్రులకు ప్రభుత్వం ఇచ్చే బంగ్లాలో నివశించడానికి ఇష్టపడలేదు. పంచ నక్షత్రాల హోటల్‌లో మకాం పెట్టాడు. అందుకోసం మూడు సూట్లు తీసుకొన్నాడు. వాటికి రోజుకు అద్దె లక్ష రూపాయలు. ఆయన మంత్రిగా వున్న మూడు నెలలకు కేంద్ర ప్రభుత్వం కోటి రూపాయల బాడుగ చెల్లించింది. ఈ దారుణ దుబారా బయటపడడంతో ఆర్థికమంత్రి ప్రణబ్ ముఖర్జీ చీవాట్లు పెట్టి, వెంటనే హోటల్ ఖాళీ చేయమన్నాడు. ఆ ఆదేశం శశిథరూర్‌కు కోపం తెప్పించింది. నా హోటల్ రూము బాడుగ నేనే కట్టుకొంటాను తప్ప ప్రభుత్వ బంగ్లాలో కాపురం వుండలేనని తెగేసి చెప్పాడు. ఢిల్లీలో మంత్రుల బంగ్లాలు విలాస జీవనానికి మారుపేరు. ఒక్కొక్కటి ఐదారు ఎకరాల విస్తీర్ణంలో, చెట్లు, పచ్చగడ్డి లాన్‌లతో రాజభవనాలు తలపింపచేస్తాయి. వాటి లోపల తివాచీలు, సోఫాలు, ఎయిర్‌కండిషనర్‌లు వంటి సౌకర్యాలన్నీ అమరివుంటాయి. కానీ శశిథరూర్‌కు మాత్రం ఆ ఇళ్లు నచ్చలేదు. అంటే, ఆయన జీవనశైలి ఎంత అందనంత ఎత్తులో వుందో అర్థం చేసుకోవచ్చు.

ఆర్థిక మాంద్యం వల్ల ఏర్పడిన గడ్డు పరిస్థితులలో ప్రభుత్వ వ్యవస్థకు, ప్రజలకు ఆదర్శంగా నడుచుకోవాలనే లక్ష్యంతో, కొన్ని పొదుపు చర్యలు ప్రకటించాడు ప్రణబ్ ముఖర్జీ. విమానాలలో సాధారణ తరగతిలో ప్రయాణించాలనేది అందులో ఒకటి. ఈ నిర్దేశానికి కట్టుబడి ప్రణబ్ ముఖర్జీతోపాటు, సోనియా, రాహుల్ గాంధీ వంటి అగ్రనేతలు కూడా సాధారణ తరగతిలో ప్రయాణిస్తున్నారు. కానీ విలాస జీవితానికి అలవాటుపడిన శశిథరూర్‌కు ఇది నచ్చలేదు. నచ్చనివాడు వాటిని లెక్క చేయకుండా మొదటి తరగతిలో తిరగవచ్చు. కానీ ఆయన "సాధారణ తరగతి"ని పశువుల కొట్టంగా అభివర్ణించాడు. మీరు కూడా ప్రణబ్ చెప్పినట్లు "క్యాటిల్ క్లాస్"లో ప్రయాణిస్తారా అని విలేకరి సరదాగా అడిగిన ప్రశ్నకు, "ఔను, పశువుల తరగతిలో పవిత్రమైన ఆవుల మద్దతుతో ప్రయాణిస్తా" నని సమాధానం చెప్పాడు. ప్రజాప్రభుత్వంలో మంత్రిగా వుండే వ్యక్తి ప్రజల గురించి ఇంత చులకనగా మాట్లాడడం ఘోరమైన నేరం. ఫస్ట్‌క్లాస్‌లో ప్రయాణించగలిగిన వారే మనుషులు, అంతకంటే తక్కువ తరగతిలో తిరిగే వారు పశువులు అన్న భావన వున్న వ్యక్తి ప్రజా ప్రభుత్వంలో ఒక్క క్షణం కూడా మంత్రిగా కొనసాగడానికి అర్హుడు కాడు. మన్మోహన్ సింగ్ ఆయన్ను వెంటనే పదవి నుంచి పీకిపారేయడం సముచితం. ఆయన్ను పార్లమెంటుకు ఎన్నుకొన్న తిరువనంతపురం ఓటర్లు కూడా ఆయన ఆ పదవికి రాజీనామా చేసేవరకు ఉద్యమం నడపడం అవసరం. ప్రజలను పశువులుగా చూసే బ్రిటిష్ దొరల జాత్యాహంకార బుద్ధి అణువణువునా జీర్ణించుకొన్న నీచులు, వారెంత మేధావులైనా, దేశహితులు కారు, కాలేరు.

## జనవాణి

### జగన్‌ను ముఖ్యమంత్రి చేయాలి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డిలా అన్నివర్గాల ప్రజల అవసరాలను తీరుస్తూ జనరంజకంగా రాష్ట్ర పరిపాలన సాగించిన ముఖ్యమంత్రి మరొకరు లేరు. ఆయన చేపట్టిన జలయజ్ఞం కార్యక్రమం దేశంలోనే బృహత్తర కార్యక్రమం. ఆరోగ్యశ్రీ పథకం ప్రపంచంలోని ఏ దేశంలో అమలు కావడం లేదు. పింఛన్లు, పావలావడ్డీకి మహిళలకు రుణాలు, రెండు రూపాయలకే కిలో బియ్యం పథకాలు సాఫీగా సాగాలంటే వైఎస్.జగన్మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేయాలి. సుస్థిర పాలనతోనే వైఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం అపూర్వ విజయాలు సాధించింది. ఇది కొనసాగాలంటే ఎమ్మెల్యేలు, ఎమ్పీలు మద్దతిచ్చే జగన్మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రి చేయాలి.

బి.సావిత్రి, నెల్లూరు.

### రాష్ట్రానికి తీరనిలోటు

ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోవడం వల్ల రాష్ట్రానికి తీరని నష్టం వాటిల్లింది. ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకొన్నాక కరెంటు ఛార్జీలు పెంచలేదు. రైతులకు వుచిత విద్యుత్ ఇస్తున్నారు. ఇంటిపన్నులు పెంచలేదు. దీనివల్ల మధ్యతరగతీయులకు ఎంతో ఊరట లభించింది. బస్సు ఛార్జీలు పెంచకపోవడం వల్ల అన్నివర్గాల ప్రజలు లాభపడ్డారు. వుద్యోగులు, కార్మిక, కర్షకులకంతా వైఎస్. రాజశేఖర్‌రెడ్డి పాలనలో ఏదో ఒక మేలు జరిగింది. వైఎస్‌లా అన్నివర్గాలను ఆదుకొనే ముఖ్యమంత్రి మళ్లీ ఎప్పటికి పుడతారు.

ఎ.ఎస్.రాయలు, నెల్లూరు.

### పేరు మార్పుల విషయమై ఆలోచించాలి!

వేలాది సంవత్సరాలుగా వున్న సంస్థలు, జిల్లాల పేరు మార్చేటప్పుడు విజ్ఞత ప్రదర్శించాలి. కొత్తగా ఏర్పడిన జిల్లాలకు సంస్థలకు కోరిన వారి పేర్లు పెట్టవచ్చు. ఆ విధంగా పెట్టిన జిల్లాలే ప్రకాశం, రంగారెడ్డి జిల్లాలు. తప్పనిసరని మన జిల్లాకు శ్రీపొట్టిశ్రీరాములునెల్లూరు జిల్లాగా పేరు మార్చారు. దివంగత ముఖ్యమంత్రి పేరు కడపజిల్లాకు పెట్టాలనుకొంటే వైఎస్.రాజశేఖర్‌రెడ్డి కడపజిల్లా అని పెడితే బాగుంటుంది. విశాఖపట్నానికి అల్లూరు

కొరవ 14వ పేజీలో

## 70 ఏళ్ల క్రితం ఈవారం

22-9-1939
పేజీలు : 14 వెల: అణా

### జమీన్‌దారీ బిల్లు

మద్రాసు ఎస్టేట్స్ ల్యాండు రెవిన్యూబిల్లు తయారై ప్రకాశం మంత్రి చేతిలోకి వచ్చిందని ఇతర మంత్రులకు యింకా సర్క్యులేట్ చేయలేదనీ తెలుస్తుంది. 12తేది మెయిలు పత్రికలో 1802 సంవత్సరం రేట్లకు తగ్గించవలెను. సూచనను త్రోసివేశారనీ వుంది - ఎవరు త్రోసివేశారో? ఏమిటో? శబ్దంలేని ఫిరంగి దెబ్బ మాదిరుంది.

### నెల్లూరు మునిసిపాలిటీ కొళాయిలు

ఇప్పటికి నెల్లూరులో ఇండ్లకు 1245 కొళాయీలను, యివిగాక వీధులలో అనేక పబ్లికు కొళాయిలు వున్నాయి. ప్రస్తుతం మెయినులైను వీటికి నీరు తృప్తికరంగా సప్లయి చేయజాలనందువలన కొత్త కొళాయిలకు వుత్తరువు ఇవ్వడంలో చాలా కఠినంగా వుండాలని ఒక సంవత్సరం నుంచి కమీషనరు గోల పెట్టుతున్నాడు. ఈ పరిస్థితులిట్లుండగా 18-9-39 మీటింగులో కౌన్సిల్ వారు 66 కొత్త కొళాయిలకు వుత్తర్వు యిచ్చారు. కాబట్టి ఈ విషయంలో జిల్లా కలెక్టరుగారు అవసర జోక్యం కలుగజేసుకొని కొళాయిల పర్మిషన్ రద్దు పలికించి, నీటి సప్లయి అభివృద్ధియగు వరకు కొత్త కొళాయీలకు పర్మిషన్ ఇవ్వకుండా చేయాలి. కౌన్సిల్‌కు నోటు పెట్టడంతో కమీషనరు డ్యూటీ తొలగిపోదు. కౌన్సిలు వారి తీర్మానం రద్దు అగునటుల ప్రభుత్వం వారికి వ్రాయాలి.

- ఒక రెంట్‌పేయరు

### యుద్ధ వార్తలు

మద్రాసు నగరం ఖాళీ చేయుటిర్పాట్లు అవసరమేర్పడినపుడు మద్రాసు సముద్ర తీరమునందు సివిల్ ప్రజలను ఖాళీచేసి బీచిస్టేషన్, తాంబరం స్టేషన్‌ల మధ్యగల స్టేషనులందు వదలివేయుటకు 10 పెట్టెలుగల 30 రైళ్లు మద్రాసు బీచిస్టేషన్‌లోనూ, మరొకర్తైలు ఎగ్మూరు స్టేషన్‌లోను సిద్ధంగా వుంచవలెనని రైల్వే అధికారులకు ప్రభుత్వం వారు తెలిపియున్నారు.

## 50 ఏళ్ల క్రితం ఈవారం

18 - 9 - 1959
పేజీలు: 12 వెల: 0-3-0

### సారాయి కాస్తూ ఇద్దరు దుర్మరణం

నెల్లూరు తాలుకా నరుకూరులో ఒక గమళ్ల యింటిలో 11తేది దొంగతనంగా సారాయి కాస్తుండగా, బట్టీకుండ బ్రద్దలై, కాస్తుండిన తాతయ్య (45), జోగేరమ్మ (35) అనువారలపై కాగుతున్న సారాయి పడి ఒళ్లు తీవ్రంగా కాలి, వెంటనే నెల్లూరు పెద్దాస్పత్రికి తీసుకరాబడి; యిచ్చట మరణించారు. నరుకూరు దొంగసారాయి ఉత్పత్తికి ప్రసిద్ధి చెందిన ప్రధాన కేంద్రమంటారు.

### మునిసిపల్ ఎన్నికల కోలాహలం

నెల్లూరు మునిసిపల్ ఎన్నికల కోలాహలం ఇప్పుడే ప్రారంభమౌతున్నది. దాదాపు అన్ని వార్డులలోనూ ఆయా అభ్యర్థులు ఓటర్లను స్వయంగా కలుసుకొని ఓట్లను అభ్యర్థించే కృషిలో నిమగ్నమై వున్నారు.

ప్రతి వార్డులోనూ అభ్యర్థుల పేర్లు, వారి ఎన్నికల గుర్తులతో ప్రతి ఇంటి గోడ ఖరాబు అయిపోయింది. తుదకు రోడ్లు సహితం విడిచి పెట్టబడడం లేదు.

ప్రచార పద్ధతులు కూడా యింకా వుధృత స్థాయినందుకోలేదు. ఎన్నికల గుర్తులు, అభ్యర్థుల పేర్లు గల స్లిప్పులు పంపకం, వీధులలో సైకిలు ఉత్సవాలు జరుగుతున్నవి. కమ్యూనిస్టులు మాత్రం వార్డులలో సభలు జరుపుతున్నారు.

ఏసి సుబ్బారెడ్డి పక్షం మాత్రం సభలు, సమావేశాలు జరపడం లేదు గాని, ఓటర్లను స్వయంగా కలుసుకోవడంలోనే నిమగ్నులై వున్నారు. కమ్యూనిస్టు ప్రముఖులు పోటీజేస్తున్న వార్డుల మీద సుబ్బారెడ్డిగారు కేంద్రీకరించియున్నారు.

మునిసిపల్ ఎన్నికల విజయావకాశాలను గూర్చి మా ప్రతినిధి ఏ.సి సుబ్బారెడ్డి గారిని ప్రశ్నించగా, ప్రస్తుతం పోటీ జరుగుతున్న 25 వార్డులలోని తన అభ్యర్థులు తప్పక గెలవగలరన్నారు.

# నీరుగారిన గ్రామదర్శిని!

**ప్రజల సమస్యల తక్షణ పరిష్కారం కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామదర్శిని కార్యక్రమం పట్ల జిల్లా అధికారులు శ్రద్ధ చూపెట్టకపోవడం వల్ల పెద్ద స్పందన లేదు.**



గ్రామదర్శిని కార్యక్రమంలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న అధికారులు.

గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలన్న లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన "గ్రామదర్శిని" కార్యక్రమం కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీరుగారి పోతుంది. గత నెల 11వ తేది నుంచి ప్రారంభమైన గ్రామదర్శిని కార్యక్రమం ప్రతి మంగళవారం మండలంలోని ఏదో ఒక గ్రామంలో నిర్వహించాలి. ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి నెల రోజులు పూర్తయినప్పటికీ ప్రభుత్వం ఆశించిన లక్ష్యాలను అధికారులు సాధించలేక పోతున్నారు.

ప్రతి సోమవారం నాడు జిల్లా కలెక్టరేట్‌లో, మండల తహశీల్దార్ కార్యాలయాల్లో ప్రజల నుంచి వివిధ సమస్యలపై అధికారులు వినతిపత్రాలు స్వీకరిస్తుంటారు. అయితే ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న అధికారులు వాటిలో పేర్కొన్న సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఫలితంగా ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగక తప్పడం లేదు. ప్రజల వద్దకే వెళ్లి గ్రామంలోని సమస్యలు తెలుసుకొని పరిష్కరించే ఉద్దేశ్యంతో "గ్రామదర్శిని" కార్యక్రమాన్ని ఏర్పాటుచేస్తే దీనికి కూడా అధికారులు తూట్లు పొడుస్తున్నారు. గతంలో వినతి పత్రాలు సమర్పిస్తే అధికారుల వైఖరి ఎలా వుండేదో అదే వైఖరిని ప్రస్తుతం అవలంభిస్తున్నారు.

## చర్యలేవి?

ప్రతి మంగళవారం గ్రామదర్శిని కార్యక్రమం జరిపి స్వీకరించిన వినతిపత్రాలపై శుక్రవారంలోగా చర్యలు చేపట్టి జిల్లా స్థాయి అధికారులకు నివేదించాలన్న ఉత్తర్వులు ఎక్కడా అమలు జరగడం లేదు. గ్రామదర్శిని కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, తహశీల్దార్‌లతోపాటు 14 శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలి. కొన్ని మండలాల్లో అన్నిశాఖల అధికారులు హాజరవుతుండగా, మరికొన్ని మండలాల్లో మాత్రం ఏదో ఒక కారణం చూపి గ్రామదర్శిని కార్యక్రమం నుంచి తప్పించుకుంటున్న సంఘటనలు కూడా వున్నాయి.

గ్రామస్థాయిలో నిర్వహించే గ్రామదర్శిని కార్యక్రమం గురించి ముందుగా దండోరా వేయాల్సి వుంటుంది. ఇందుకు పంచాయితీ కార్యదర్శి బాధ్యత తీసుకోవాలి. ఇలా దండోరా వేయడం వల్ల గ్రామస్తులు ముందుగా అధికారుల పర్యటన గురించి తెలుసుకొని సమస్యలను నివేదించే అవకాశం కలుగుతుంది. గ్రామాలలో ఒకరోజు ముందు దండోరా వేయనందున గ్రామస్తులు కూలి పనులకు వెళ్లిపోతున్నారు. దీంతో గ్రామంలోకి వెళ్లిన అధికారులు పిచ్చాపాటీగా కబుర్లు చెప్పుకుంటూ సాయంత్రం వరకు కాలం వెళ్లబుచ్చుకోవాల్సిన పరిస్థితి. మేజర్ గ్రామ పంచాయితీ పరిధిలోని గ్రామాలలో పరిస్థితి మరోవిధంగా వుంటుంది. దాదాపు ఐదారు మజరా గ్రామాలు మేజర్ గ్రామ పంచాయితీలో వుంటాయి. ఈ గ్రామాల మొత్తానికి కలిపి గ్రామ పంచాయితీ కార్యాలయంలోనే గ్రామదర్శిని నిర్వహిస్తున్నారు.

## సమాచారం లేదు

మేజర్ గ్రామ పంచాయితీ పరిధిలో నివశించే గ్రామస్తులను "గ్రామదర్శిని" కార్యక్రమం గురించి ప్రశ్నిస్తే తెల్లముఖం వేస్తున్నారు. గ్రామదర్శిని కార్యక్రమం గురించి తమకేమీ తెలియదంటున్నారు. గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించే అన్నిశాఖల అధికారులు గ్రామంలో పర్యటించి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల తీరును పరిశీలించాలి. ఇందిరమ్మ ఇళ్లు, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, పారిశుధ్యం, త్రాగునీటి సరఫరా, పశుక్రాంతి పథకం, పావలావడ్డీ రుణాలు, వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్లు అందుతున్నాయా? లేదా? అనే వివరాలు తెలుసుకోవాలి. అలాగే గ్రామంలో ఎంతమందికి ఇళ్లస్థలాలు అవసరం అన్న విషయాలను పూర్తిగా అధికారులు విస్మరిస్తున్నారు.

గ్రామదర్శిని కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ఉన్నతాధికారులను నియమించకపోవడం వల్ల మండలస్థాయి అధికారులు ఈ కార్యక్రమం పట్ల పెద్దగా ఆసక్తి చూపడం లేదన్న విమర్శలు వున్నాయి. గతంలో గ్రామ సమస్యలపై సమర్పించిన అర్జీలపైనే ఇంతవరకు స్పందించని అధికారులు, గ్రామదర్శిని కార్యక్రమంలో సమర్పించిన అర్జీలపై ఎలా స్పందిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించే సమయంలో చూపిన ప్రత్యేక శ్రద్ధ, అమలుచేసే విషయంలో మాత్రం చూపడం లేదు అధికారులు. ఇకపోతే ప్రజాప్రతినిధులు, స్థానిక ఎమ్మెల్యేలు ఎందుకో గ్రామదర్శిని కార్యక్రమానికి దూరంగా వుంటున్నారు. అధికారుల నుంచి ముందుగా సమాచారం లేదనో, అధికారులే చూసుకుంటారు మనకెందుకులే అనుకుని జడ్పీటీసీలు, ఎమ్పీటీసీలు మౌనంగా వుండిపోతున్నారు.

## వీఆర్వోల జేబులకు చిల్లు

గ్రామదర్శిని కార్యక్రమం పుణ్యమా అంటూ గ్రామ రెవిన్యూ అధికారుల జేబులకు చిల్లు పడుతుంది. గ్రామస్థాయిలో నిర్వహించే గ్రామదర్శిని కార్యక్రమం ఏర్పాట్ల బాధ్యతలను వీఆర్వోలకు తహశీల్దార్‌లు అప్పగిస్తున్నారు. అధికారులు ఆదేశించడంతో వీఆర్వోలు గ్రామంలోని రేషన్‌షాపుల డీలర్లు, సర్పంచ్‌ల వద్దకెళ్లి ఏర్పాట్లకు అవసరమైన నిధులను సమకూర్చాలని అభ్యర్థించక తప్పడం లేదు. రేషన్‌షాపు డీలర్లు, గ్రామసర్పంచ్‌లు ముందుకు రాని పక్షంలో వీఆర్వోల జేబుల్లో నుంచి ఏర్పాట్లకు ఖర్చు చేస్తున్నారు. షామియానాలు, కుర్చీలు, మధ్యాహ్నం భోజనం, తదితర సదుపాయాలు కల్పించాల్సిరావడంతో వీఆర్వోలు లబోదిబోమంటున్నారు.

గ్రామదర్శిని కార్యక్రమానికి అవసరమైన నిధులు మండల పరిషత్ నుంచిగానీ, గ్రామపంచాయితీ నుంచి ఖర్చు చేయాలి. పై రెండు శాఖల నుంచి కాకుండా వీఆర్వోలు, పంచాయితీ కార్యదర్శుల చేత ఖర్చు చేయించడంపై వీఆర్వోలు, పంచాయితీ కార్యదర్శులు ఆర్థికంగా నష్టపోతున్నామంటున్నారు. అధికారుల ఆదేశాలు కాదనలేక, ఏర్పాట్లు చేయలేక సతమతమవుతున్నారు. గ్రామదర్శిని కార్యక్రమానికి ప్రభుత్వం ఎటువంటి నిధులు కేటాయించలేదని మండలస్థాయి అధికారులు అంటున్నారు. పంచాయితీ కార్యాలయం వద్దనే గ్రామదర్శిని నిర్వహించాలని ప్రభుత్వ ఉత్తర్వులు వున్నాయని చెబుతున్నారు. బలవంతంగా ఎవరిపైనా ఏర్పాట్లభారం వేయడం లేదని అంటున్నారు.

గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లకు అవసరమైన నిధులు ఇవ్వకపోవడం అధికారులకు ఇబ్బందిగా పరిణమించింది. గ్రామ పంచాయితీలలో నిధులున్నా ఈ కార్యక్రమానికి ఖర్చు చేసేందుకు అవకాశంలేదని కొందరు సర్పంచ్‌లు వ్యాఖ్యానించారు. గ్రామానికి వచ్చిన అధికారులకు మర్యాదపూర్వకంగా అన్నిఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మొత్తం మీద గ్రామదర్శిని కార్యక్రమం ప్రజలకు లబ్ధిచేకూరే విధంగా అమలు జరగడం లేదు. ఆర్థిక వనరులతో కూడిన వినతి పత్రాలు అధికంగా రావడం వల్ల అధికారులు ఏంచేయాలో తెలియక చేతులెత్తేస్తున్నారు.

గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు రూపొందించిన గ్రామదర్శిని సంకల్పం, ఉద్దేశం దెబ్బతినకుండా జిల్లాస్థాయి అధికారులు తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం వుంది.

### త్వరగా పరిష్కరించాలి!



గ్రామదర్శిని కార్యక్రమంలో స్వీకరించిన వినతి పత్రాల్లోని సమస్యలను సంబంధిత శాఖల అధికారులు త్వరగా పరిష్కరించాలి. ప్రజల సమస్యలు, గ్రామ సమస్యలను పరిష్కరించిన నాడే గ్రామదర్శిని ఉద్దేశం నెరవేరుతుంది. వృద్ధాప్య పింఛన్లు, ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి సంబంధించి ఎక్కువగా ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు.

బి.ప్రకాశం
కొండ్లపూడి సర్పంచ్

### ఆలస్యం చేయకూడదు



గ్రామదర్శిని కార్యక్రమం ద్వారా అనేక సమస్యలపై ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను జాప్యం చేయకుండా వెంటనే పరిష్కరించేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలి. గ్రామానికి అధికారులు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అధికారులు చిత్తశుద్ధితో ప్రజల సమస్యల పట్ల కృషిచేస్తే బాగుంటుంది.

వనజాక్షమ్మ,
సోత్‌మోపూరు సర్పంచ్

### నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు!



గ్రామదర్శిని కార్యక్రమంలో ప్రజలు అందజేసిన వినతిపత్రాలపై వెంటనే స్పందించాలని అధికారులకు ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకొనేందుకు వెనుకాడబోము. జిల్లాలో ఇప్పటివరకు 6946 అర్జీలు రాగా వీటిలో 1584ను పరిష్కరించడం జరిగింది. మిగిలిన వాటిని కూడా త్వరలో పరిష్కరిస్తాం.

కె.రాంగోపాల్,
జిల్లా కలెక్టర్

# కలిగిరిలో ప్రత్తిమిల్లు ఎప్పుడు?

## వైఎస్ హామీ నెరవేర్చరా?

ప్రత్తిరైతులకు అనువుగా వుంటుందని, వారికి గిట్టుబాటు ధర లభిస్తుందనే ప్రయోజనంతో కలిగిరిలో నిర్మించిన ప్రత్తిమిల్లు ఏడాది గడిచినా ప్రారంభానికి నోచుకోలేదు. ముఖ్యమంత్రిగా వున్న రాజశేఖర్‌రెడ్డి నాలుగు సంవత్సరాల క్రిందట ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు ప్రత్తిరైతుల సమస్యలు తెలుసుకొని వారి కోరిక మేరకు ఇక్కడ మిల్లును నిర్మించుకొనేందుకు హామీ ఇచ్చారు. దాని నిర్మాణం పూర్తయి సంవత్సరం గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోకపోవడంతో ఈ మిల్లు వస్తే గిట్టుబాటు ధర లభిస్తుందని, లాభాలు కలుగుతాయని ఆశించిన ప్రత్తిరైతులకు నిరాశే మిగిలింది. విరివిగా ప్రత్తి సాగుచేసిన రైతులు గిట్టుబాటు ధర లభించక దళారులకు వారు అడిగిన ధరకు అమ్మి నష్టపోతున్నారు. ఆరుగాలం శ్రమించి వేసిన పంట చేతికొచ్చి నాలుగు రాళ్లు వెనకేసుకోవచ్చన్న రైతుల శ్రమ దళారుల పాలుకావడంతో రైతులు కన్నీళ్ల పర్యంతం అవుతున్నారు. ఇప్పటికైనా కాటన్‌మిల్లును ప్రారంభించి తమకు లబ్ది చేకూర్చాలని ప్రత్తిరైతులు కోరుకొంటున్నారు.

# ఉదయగిరిలోనూ కబ్జాలు!

## "మెట్ట ప్రాంతంలోనూ అంకణం 30 వేలయ్యింది"

భూముల ధరలు విపరీతంగా పెరిగిపోతుండడంతో కబ్జాదారుల కన్ను ఉదయగిరి ప్రాంతంలోని ఖాళీ స్థలాలపై పడింది. ప్రభుత్వ, ప్రైవేట్ స్థలం అని చూడకుండా రాత్రికిరాత్రి వాటిని ఆక్రమించి వేస్తుండడంతో కబ్జాలపర్వం నిరాటంకంగా సాగుతోంది. లక్షలాదిరూపాయలు విలువచేసే ప్రభుత్వ ఆస్పత్రి వెనుకవైపు గల స్థలాన్ని ఆక్రమించి శాశ్వత కట్టడాలు నిర్మిస్తుండడం గమనిస్తే ఉదయగిరిలో ఎంత పెద్ద ఎత్తున భూ ఆక్రమణలు జరుగుతున్నది స్పష్టమవుతుంది. అంకణం పదివేల నుంచి ముప్పైవేల రూపాయలకుపైగా ధర వుండడంతో కన్పించిన స్థలాలు ఆక్రమణదారుల చేతుల్లో చిక్కుకొంటున్నాయి. కాలువలపైనా కట్టడాలు నిర్మించి వేస్తున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండడంతో ఉదయగిరి ప్రాంతం కబ్జాలచెరలో చిక్కుకొంటున్నది.

# అన్నీ అపశకునాలే

దక్షిణ భారతదేశంలో అదిపెద్ద పారిశ్రామిక కేంద్రంగా ఏర్పాటు చేయాలన్న ఎస్‌బిక్యూ కంపెనీ యాజమాన్యానికి అడుగడుగునా అపశకునాలే ఎదురౌతున్నాయి. ఇప్పటికి నాలుగుసార్లు ప్రారంభోత్సవ కార్యక్రమాలు వాయిదాపడ్డాయి. 2007లో మనుబోలు మండలం కొలగుకుదురులో ఏర్పాటు చేయాలని సర్వేనెంబరు 520సిలో 1000 ఎకరాలు కేటాయించారు. ముఖ్యమంత్రిని భూమిపూజకు పిలిచారు. భారీ వర్షాల కారణంగా నీళ్లు నిలబడిపోవడంతో ఎస్‌బిక్యూ అధికారులు ఈ స్థలం మాకొద్దంటూ సిఎంకు విన్నవించారు. భూసేకరణ అధికారి కత్తి సుబ్రహ్మణ్యంరెడ్డి చిల్లకూ

## ఎస్‌బిక్యూ స్టీల్ పరిశ్రమ ఆరంభం నుంచి అంతే

రుకు సమీపంలోని అంకులపాటూరు భూములను రైతుల నుంచి స్వాధీనం చేసుకొని కంపెనీకి అందించారు. 2007 డిసెంబర్ 6వ తేది సిఎం ద్వారా చేయాల్సిన భూమిపూజ వర్షాల కారణంగా తిరిగివాయిదా పడింది. కంపెనీ నిర్వాహకులు శంకుస్థాపన చేసి పనులు పూర్తి చేశారు. కంపెనీ ప్రారంభోత్సవానికి తగిన ఏర్పాట్లు చేసి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించాలనుకొన్నారు. అయితే హఠాత్తుగా హెలికాప్టర్ దుర్ఘటనలో ఆయన మరణించడంతో కంపెనీ యాజమాన్యం దిక్కుతోచని స్థితిలో పడింది.



పార్లమెంటులో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం పెట్టాలని ముఖ్యమంత్రి రోశయ్యను కలసి వినతిపత్రం ఇస్తున్న నెల్లూరు వైశ్య ప్రముఖుడు కె.వి.చలమయ్య



కావలిలో జరిగిన దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి సంతాపసభలో మాజీ ఎమ్మెల్యేలు విష్ణువర్ధన్‌రెడ్డి,.పార్వతమ్మ, ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే బీద మస్తానయ్య తదితరులు.




హైదరాబాద్‌లోని భారతీయ ఉత్పాదక మండలి గోల్డన్ జూబ్లీ ఉత్సవాలను పురస్కరించుకొని ఉత్తమ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ఇచ్చిన అవార్డును పరిశ్రమల మంత్రి కన్నా లక్ష్మీనారాయణ నుంచి అందుకొంటున్న నెల్లూరీయురాలు చాముండేశ్వరి టేస్టీ పికిల్స్ ఎండి జె.రాజేశ్వరి.

## ● ముత్తుకూరులో మహిళా ఉద్యమం

ముత్తుకూరు మండలంలో వుండే బెల్టుషాపులను తొలగించాలని మహిళలు ఆందోళన చేపట్టారు. మద్యానికి బానిసలై తమ భర్తలు ఇళ్లు, ఒళ్లు గుల్ల చేసుకొంటుండడంతో బెల్టు షాపులకు వ్యతిరేకంగా నడుంబిగించారు. స్థానిక మద్యం విక్రయదార్లకు హెచ్చరికలు జారీ చేశారు. గతంలో పలుమార్లు బెల్టుషాపులను తొలగించాలని అధికారులకు విన్నవించినా పెడచెవిన పెట్టారని ఆరోపించారు. రెక్కాడితేగాని డొక్కాడని తమ బ్రతుకులు మద్యం కారణంగా కునారిల్లుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు బెల్టుషాపులని తొలగించాలని లేకపోతే తామే ప్రత్యక్ష చర్యలకు దిగుతామని హెచ్చరికలు జారీ చేశారు.

# కలువాయి చేరిన మట్టిపాముల వేట

రెండు తలలున్న మట్టిపాముకు అప్పగిస్తే లక్షల రూపాయలు ఇస్తున్నారన్న ప్రచారంతో జిల్లాలో పాముల వేట జోరుగా సాగుతుంది. జిల్లా కేంద్రంగా ఏర్పడ్డ ముఠా ఈ ప్రచారానికి ఊతమిస్తూ ప్రజలకు ఆశ కల్పిస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. గతంలోనూ ఇలాగే నల్లతా ఆలాకు, ఎర్ర కలబందాకు, చింత దుంపాకు, నల్లపిల్లి, పాతకాలం నాటి రాగి లోహవస్తువులు అప్పగిస్తే లక్షల

## ● గతంలోనూ పిచ్చివస్తువుల సేకరణ

రూపాయలు ఇస్తామన్న ప్రచారం వుండేది. జనం అప్పట్లో వాటి కోసం ఇళ్లు వదలి అడవుల్లో తిరుగుతూ ఒళ్లు గుల్ల చేసుకొన్నారు తప్పితే ఒక్క రూపాయి సంపాదించింది లేదు. ఈ వెతుకులాటలో కలువాయిలో ఒక వ్యక్తి మృతి చెందాడు. మళ్లీ ఇప్పుడు రెండు తలలపాము కోసం వెదుకులాట మొదలైంది. లక్షల రూపాయలు లభిస్తాయన్న ఆశతో జనం వేలం వెర్రిగా చెట్టు, పుట్ట పట్టుకొని తిరగడం గ్రామాల్లో నిత్యకృత్యం అయ్యింది. కలువాయి చుట్టుపక్కల గ్రామాల్లో యువకులు ఉపాధిపనులు మానుకొని పాముల వేటలో నిమగ్నమై వున్నారు.

# తగ్గిన తృణధాన్యాల సాగు!

ఆత్మకూరు ప్రాంతంలో తృణ ధాన్యాల సాగు తగ్గుముఖం పడుతోంది. ఒకనాడు అధికంగా సాగవుతుండే ఈ పంటలు రానురాను తగ్గిపోవడానికి కారణం రైతులు విముఖత చూపడమే. జొన్న, సజ్జ, రాగి, కొర్రలు విరివిగా పండించారన్న సంగతి ఇప్పటివారికి తెలియనంతగా రైతులు వాణిజ్య పంటలపై దృష్టి సారించారు. నెల్లూరు

## ప్రోత్సాహం లేక....

డివిజన్‌లో 12 మండలాల్లో 227 హెక్టార్లలో సజ్జ, రాగి, ఆత్మకూరు మండలంలో 32 హెక్టార్లల్లో సజ్జ, రాగి, జొన్న, అనంతసాగరం మండలంలో రాగులు 8 హెక్టార్లలో సాగవుతున్నాయి. ఒకనాడు ఉధృతంగా సాగిన ఈ పంటలసాగు నేడు చాలావరకు తగ్గిపోయింది. ఈ పరిస్థితులలో అధికారులు రైతులను తృణ ధాన్యాలు పండించే దిశగా ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## బహుముఖుడు



అపరిచితుడు చిత్రంలోని ఒక సన్నివేశంలో రెండు పాత్రల్లో నటించిన హీరో విక్రమ్‌ను చూసి అందరూ నోరెళ్లబెట్టారు. ఇటువంటి నటులకు తానేమీ తక్కువకాదని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి మరోసారి చాటి చెప్పిన విషయం సింహపురిలో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రమాదవశాత్తు మరణించడంతో హైదరాబాద్, నెల్లూరుల్లో జరిగిన వివిధ సంతాప కార్యక్రమాల్లో వివేకానందరెడ్డి కన్నీళ్ల పర్యంతమయ్యే ముఖకవళికలతో కనపడి అందరి సానుభూతి పొందారు. కాని ఆయనలోని అంతర్ముఖుడు కోడూరుబీచ్‌లో జరిగిన వేళాంగిణి మాత ఉత్సవాల్లో బయటపడ్డాడు. సంతాపదినాల్లో జరిగిన ఈ ఉత్సవాల్లో ఆయన పాల్గొంటే పాల్గొన్నారు కాని యువతులతో కలసి పాటకచ్చేరిలో పాట పాడడంతో చూసినవారు 'ఔరా' అనడం మినహా మరోమాట అనలేక పోయారు.

## విలేకరిగా రౌడీషీటర్



తొండ ముదిరి ఊసరవెల్లిగా మారడం, రౌడీ ముదిరి రాజకీయ నాయకుడయ్యాడనడం ఇవన్నీ పాత పోలికలు. నెల్లూరులో ఓ రౌడీషీటర్ విలేకరిగా మారారు. హైదరాబాద్ నుంచి వెలువడే ఒక దినపత్రికకు బ్యూరో చీఫ్‌గా నియమితులయ్యారు. ఆయనేమీ ఈ విషయాన్ని గుట్టుగా దాయలేదు. కలెక్టర్, ఎస్పీ మొదలు ఇతర ముఖ్యుల ప్రెస్‌మీట్లకు పెన్, ప్యాడ్ పట్టుకొని కెమెరామెన్‌తో సహా వస్తుండడంతో ముందు పోలీసులు విస్తు పోయారు. ఆ తర్వాత ఈ విషయం తెలుసుకొని దంగై పోవడం సింహపురి పాత్రికేయుల వంతయ్యింది. నెల్లూరులో పుట్టి అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయికి ఎదిగిన పాత్రికేయులున్నారు. ఈ మధ్య ఎలక్ట్రానిక్ మీడియా విజృంభణ మూలంగా వాటిలో జరిగిన నియామకాల వల్ల మీడియాపై గౌరవం సన్నగిల్లుతున్న తరుణంలో ఏకంగా రౌడీషీటర్ విలేకరి రూపమెత్తడం పాత్రికేయులోకానికి శరాఘాతమనక తప్పదు.

## వెక్కి వెక్కి ఏడ్చిన నారాయణ

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గడచిన ఐదారేళ్లలో నెల్లూరు రాజకీయాల్లో ఆనం సోదరులను బాగా ప్రోత్సహించారు. వారి పురోభివృద్ధితోపాటు కోరిన పనల్లా చేసిపెట్టారు. వివేకానందరెడ్డి కన్నా రామనారాయణరెడ్డికే రాజశేఖర్‌రెడ్డి దగ్గర చనువు జాస్తి. ఆయన 'నారాయణ' అని మంత్రిని నోరార పిలిచేవారు. గతవారం నెల్లూరు వీఆర్‌సి మైదానంలో అఖిలపక్షం నేతృత్వంలో జరిగిన వైఎస్ సంతాపసభలో మాట్లాడను రామనారాయణ గొంతు పెగలలేదు. వెక్కి వెక్కి ఏడ్వనారంభించడంతో సభలో ఉద్విగ్న భరిత వాతావరణం నెలకొనింది. ముఖ్యమంత్రి సంతకం చేసిన చివరి ఫైల్ నెల్లూరునగర డ్రైనేజి సమస్య పరిష్కారానికి వుద్దేశించిందని రామనారాయణ గద్గదస్వరంతో ప్రకటించడంతో సభలో వుండిన వారి హృదయాలు బరువెక్కాయి.





## ట్రాఫిక్ తెచ్చిన 'తంటా'!

నెల్లూరు ఎస్పీ మల్లారెడ్డి గారికి ట్రాఫిక్ అంటే మహా చెడ్డ చిరాకు. నగరంలోని ట్రాఫిక్ నడతను భగవంతుడు కూడా మార్చలేడని బహిరంగంగానే చెబుతుంటారాయన. అందువల్లే నెల్లూరు ట్రాఫిక్ పద్మవ్యూహంలా మారినా ఆయన దానిలో పొరపాటున కూడా వేలు పెట్టలేదు. అటువంటి జెంటిల్‌మాన్‌ను ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అంత్యక్రియల సందర్భంగా వేంపల్లె జంక్షన్‌లో ట్రాఫిక్‌ను నియంత్రించమని వున్నతాధికారులు పురమాయించారు. ఇంకేముంది హోంమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, మంత్రులతో సహా పలువురు వీఐపీలకు రాజశేఖర్‌రెడ్డి కడసారి చూపు దక్కలేదు. ఈ విషయమై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరిగింది. ట్రాఫిక్ అంటేనే ఇష్టపడని ఎస్పీకి మొత్తం మీద ఈ వ్యవహారం వల్లే మహా తిప్పలొచ్చిపడ్డాయి. వాటిని ఆయన ఏ విధంగా అధిగమిస్తారో వేచిచూడాల్సిందే!


# ఉత్తరక్రియలు



కీ॥శే॥ టి. సరోజనమ్మ

జననం : 14-10-1929 మరణం : 14-09-2009

మమతానురాగాల అమృతమూర్తి, మా ఇంటిదైవం
మా అమ్మగారైన తిరువాయిపాటి సరోజనమ్మ గారు
(స్వర్గీయ తిరువాయిపాటి నరసయ్యగారి ధర్మపత్ని)
తేది 14-09-2009 సోమవారం హైదరాబాదులో స్వర్గస్థులైనారు.
వారి ఆత్మకు శాంతిని కలుగజేయమని భగవంతుని ప్రార్థిస్తున్నాము.

:- ఉత్తరక్రియలు :-

తేది 24-09-2009 గురువారం నాడు పెద్దకర్మ
డోర్‌నెం. 7-1-621/270 కమ్యూనిటీహాల్, యస్.ఆర్.నగర్,
హైదరాబాదులో జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

-: కుమారులు :-

డా.టి. వసంతకుమార్, Msc., M.Phill, Phd.
Principal, Sriharsha Institute of P.G.Courses,Nellore.

డా.టి. నందకుమార్, MD., FACP., MRCP.
(U.S.A)

డా.టి. మదన్ మోహన్
MBBS., P.G.C(DIAB), FCGP, LLB.
Shiva Diabetic Care, Hyderabad.

టి.కృష్ణమోహన్, MSc., M.Ed.,
Director, Gowtham Vidyalaya
Salubrious Labs Pvt. Ltd., Hyderabad.

-: కోడళ్లు :-

టి. వరలక్ష్మి, M.A.,
Asst. Manager, Andhra Bank,
VRC, Nellore.

టి. యశోదలక్ష్మి
(U.S.A)

డా.టి. పద్మశ్రీ
BHMS., M.A.
Padmasri Clinic, Hyderabad

టి. రాధ
B.A., .

మనుమలు - మనుమరాండ్రు }
టి. స్వరూప్, B.Tech.,Software Engineer -IBM,Bangalore. టి. తేజస్వి, Medico, (USA)
టి. త్రివిక్రమ్, Medico టి.కృష్ణనారాయణ, Medico టి.సుష్మ సంగీత, Medico టి.సాయి సరోజ

# మొక్కుబడిగా మండల సమావేశాలు!

## జిల్లాలో అతిపెద్ద మండలం నెల్లూరు రూరల్‌దీ అదేబాట.



నెల్లూరు రూరల్ మండల సమావేశానికి విచ్చేసిన ఎమ్పీటీసీలు, సర్పంచ్‌లు.

ప్రజల సమస్యల సత్వర పరిష్కారం, గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలన్న లక్ష్యంతో నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాలు నామమాత్రంగా జరుగుతున్నాయి. అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసి, జడ్పీటిసిలు సమావేశానికి హాజరై రాజకీయ కబుర్లు చెప్పుకుంటూ విలువైన సమయాన్ని వృధా చేస్తున్నారు. ఫలితంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు మంజూరు కాకుండా పోతున్నాయి. మండల స్థాయిలో నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని అన్నిశాఖల అధికారులతోపాటు స్థానిక ఎమ్మెల్యే కూడా హాజరుకావాల్సి వుంటుంది. కాని వీటికి జిల్లాలో కొందరు ఎమ్మెల్యేలు మాత్రమే హాజరవుతున్నారు.

ఈ నెల 14వ తేదిన నెల్లూరు రూరల్ మండల సర్వసభ్య సమావేశం జరిగిన తీరు పరిశీలిస్తే ఈ సమావేశాలు ఏ రీతిన జరుగుతున్నాయో అర్థమవుతుంది. ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం 11.30 గంటలకు ప్రారంభించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డికి నివాళులర్పించిన అనంతరం సమావేశాన్ని మండల పరిషత్ అధ్యక్షులు పొట్టేపాళెం చంద్రమౌళి అధ్యక్షతన నిర్వహించారు. అజెండాలో మండలంలోని పలు సమస్యలను చేర్చలేకపోయారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం క్రింద గ్రామీణప్రాంత రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరైనాయని ఎంపిడిఓ వెంకట్రావ్ వెల్లడించారు.

ఇటీవల రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన కరవు మండలాల జాబితాలో నెల్లూరు రూరల్ మండలం చోటు చేసుకోలేదు. నెల్లూరు రూరల్ మండలాన్ని కూడా కరవు మండలంగా ప్రకటించాలని మండల సమావేశంలో తీర్మానించారు. పై రెండు అంశాలు తప్ప ఇతర అంశాలు సమావేశాలు చర్చకు రాలేదు. అసలు మండల సర్వసభ్య సమావేశం ఎందుకు ఏర్పాటు చేస్తున్నారో అర్థంకాని పరిస్థితులు నెలకొంటున్నాయి. గ్రామ ప్రజలకు సంబంధించిన సమస్యలను అజెండాలో పొందు పరచడంలో ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు విఫలమవుతున్నారు.

కొన్ని శాఖల. అధికారులు సమావేశానికి వస్తే మరికొన్ని శాఖల అధికారులు ఏదో ఒక కారణాలు చూపి సమావేశానికి డుమ్మాకొడుతున్నారు. ఈ క్రమంలో మండల సమావేశం అజెండా, తీర్మానాలు మండల సమస్యలు గురించి పలువురు వెల్లడించిన అభిప్రాయాలను దిగువనిస్తున్నాం.

### పటిష్టంగా సమావేశాలు!



మండల పరిషత్ సర్వసభ్యసమావేశాలను వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు సభ్యుల అనుమతి కోరను నిర్వహించడం జరుగుతుంది. నెల్లూరు రూరల్ మండలంలోని సర్పంచ్‌లు, ఎంపిటిసి, జడ్పీటిసిలు అందరు సమావేశానికి హాజరుకావాల్సి వుంటుంది. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుతీరు, గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి పరిష్కరించడం జరుగుతుంది.

పి.చంద్రమౌళి, మండల పరిషత్ అధ్యక్షులు, నెల్లూరురూరల్.

### సమస్యలను పరిష్కరిస్తాం!



నెల్లూరు రూరల్ మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. మండల సర్వసభ్య సమావేశాల్లో కూడా గ్రామాల్లోని సమస్యలపై చర్చించి సభ్యుల ఆమోదంతో పనులు చేపట్టడం జరుగుతుంది. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం క్రింద గ్రామీణప్రాంత రోడ్ల అభివృద్ధికి 50 లక్షలు మంజూరయ్యాయి. వీటిపై చర్చించేందుకు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశాం.

వెంకట్రావ్, ఎంపిడిఓ, నెల్లూరురూరల్.



నెల్లూరు కొండాయపాళెం గేటు వద్ద గల బిసి బాలుర హాస్టల్‌లో పిల్లలకు పెట్టే భోజనాన్ని తిని రుచి చూస్తున్న రాజ్యసభ సభ్యుడు పెనుబల్లి మధు. ప్రక్కన డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, ఎస్ఎఫ్ఐ నాయకుడు నారాయణస్వామి తదితరులు.



Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/09-11



## రోశయ్య అంత

# సత్తాలేనివాడా!

కాంగ్రెస్ అధినాయకత్వం ఎంపిక చేసిన ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య పట్ల కాంగ్రెస్ మంత్రులు, ఐఏఎస్ అధికారులు అనుసరిస్తున్న వైఖరి అభ్యంతరకరంగా వుంది. అధిష్టానం నుంచి స్పష్టమైన సంకేతాలు వస్తున్నప్పటికీ సగం మంది మంత్రులు ఆయన క్రింద పని చేయడం తమకు పరువు తక్కువ అన్నట్లు ప్రవర్తిస్తున్నారు. ఆయన్ను మర్యాద పూర్వకంగా కలవడానికీ వారు ఇష్టపడడం లేదు. ఆయన పెట్టే సమావేశాలకు కావాలని గైర్హాజరౌతున్నారు. వైఎస్‌ఆర్ అంతేవాసులుగా పనిచేసిన ఐఏఎస్ అధికారులు, ముఖ్యమంత్రికి ఫైళ్లు పంపడం లేదు. జగన్ వచ్చిన తర్వాత చూసుకొందామనే ధోరణిలో మాట్లాడుతున్నారు అధికారులు.

రోశయ్య నిజంగానే అంత సత్తాలేని వాడా? ఎంత మాత్రం కాదు. పరిపాలన గురించి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో ఆయనకు తెలిసినంత సమగ్రంగా మరెవ్వరికీ తెలియదనడం నిజం. యాభైఏళ్ల సుదీర్ఘ రాజకీయఅనుభవం, అందులో దాదాపు ఇరవై ఏళ్లపాటు మంత్రిగా పనిచేసిన చరిత్ర ఆయనకు మాత్రమే పరిమితం. మరే కాంగ్రెస్‌వాది కూడా ఇంత దీర్ఘకాలం మంత్రిగా పని చేయలేదు. సెక్రటరియేట్‌లో ఏ ఐఏఎస్ అధికారి ఎటువంటివాడో, ఏ మంత్రి ఎంతమాత్రం వాడో ఆయనకు క్షుణ్ణంగా తెలుసు. ఏ కీలు మెలి పెడితే ఎవరి వంకరలు సరి చేయవచ్చో కూడా తెలుసు. అదే సమయంలో, అనువైన పరిస్థితి కోసం వేచి చూసే ఓపిక కూడా వుంది. అటు రాజకీయవాదులు, ఇటు అధికారులు, మధ్యలో పత్రికలు తన పట్ల చేస్తున్న చులకనప్రాయపు వ్యాఖ్యల పట్ల ఆయన స్పందించకపోవడానికి ఈ సహనమే కారణం తప్ప, సత్తా లేకపోవడం కాదు.

మహాలయపక్షాలు సెప్టెంబర్ 20తేదితో ముగియనున్నాయి. అవి కాగానే, 21తేది తిరుమల దర్శనం తల పెట్టాడు. అది ముగియగానే, సి-బ్లాక్‌లోకి తన కార్యాలయాన్ని మార్చుకొని, సిఎం పేషీని సమగ్రంగా పునర్వ్యవస్థీకరించి, 23 లేదా 24తేది ఢిల్లీకి వెళ్లి, సోనియాగాంధీని కలిసి వచ్చిన తర్వాత నిజమైన ముఖ్యమంత్రిగా కొరడా చేపట్టాలన్నది రోశయ్య ఆంతర్యమని చెప్తున్నారు. రాజశేఖర్‌రెడ్డి మరణంతో దిగ్భ్రాంతి చెంది వున్న రాష్ట్ర ప్రజలను తన రాజకీయ గొడవలతో మరింత గందరగోళపరచడం తన ఉద్దేశం కాదని చెప్తున్నాడాయన. అంత మాత్రాన్నే తనను తేలికగా జమకట్టి, చులకనగా తీసి పారేయడం ఆయన మనసుకు కష్టం కల్గిస్తున్నది. వీరందరికీ ఈ నెలాఖరు నుంచి సున్నితంగా బుద్ధి చెప్పే ప్రయత్నం ప్రారంభించబోతున్నాడని వినికిడి.

ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి పదవి ఖాళీ లేదని, రోశయ్య పూర్తి కాలం ముఖ్యమంత్రి అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జయంతి నటరాజన్ చేసిన ప్రకటన రోశయ్యకు ఎక్కడలేని బలాన్ని సమకూర్చింది. ఆ ప్రకటన వచ్చిన వెంటనే,

కొరవ 14వ పేజీలో

## జనంలోకి జగన్

కాంగ్రెస్ అధిష్టానం మీద ఒత్తిడి పెంచడానికి జనంలోకి వెళ్లాలన్న నిర్ణయం తీసుకొన్నాడు వైఎస్.జగన్. ఎన్నిరకాలుగా ప్రాధేయపడినా, ఎన్ని రాయబారాలు నడిపినా సోనియాగాంధీ తనకు ముఖ్యమంత్రి పదవి ఇచ్చేందుకు ఇష్టపడకపోవడంతో, జనంలో ఒక తీవ్రస్థాయి ఉద్యమం లేవనెత్తి, అధిష్టానాన్ని లొంగదీయాలన్నది జగన్ ఆంతర్యమని తెలుస్తున్నది. ఇందుకు నాందీ ప్రస్తావనగా శనివారం తర్వాత ఇడుపులపాయకు బయలుదేరి వెళ్తున్నాడు. వారం రోజుల పాటు పులివెందుల, కడప ప్రాంతాలలోనే మకాం పెట్టి, భారీస్థాయిలో జన సమీకరణ చేస్తారు. సహజంగానే వచ్చిన వారు జగన్ సిఎం కావాలని నినదిస్తారు. ఆ తర్వాత వందమందికి తక్కువ కాకుండా ఎమ్మెల్యేలను, ముప్పై మంది వరకు ఎమ్పీలను వెంటబెట్టుకొని, తన తండ్రి మరణించిన పావురాల గుట్టకు వూరేగింపుగా వెళ్తారు. కాంగ్రెస్ పార్టీ మొత్తం జగన్‌తోనే వున్నదని నిరూపించడానికి ఈ ఎమ్మెల్యే, ఎమ్పీల సమీకరణ ఉపయోగపడుతుందని జగన్ భావన. అప్పటికీ అధిష్టానం లొంగిరాకుంటే, జిల్లా పర్యటనలకు వెళ్తాడట. తాను వెళ్లిన చోటల్లా జనం ఒక ప్రభంజనం వలె తరలి వచ్చి, తనను సిఎం కావాలని నినదించే సన్నివేశాలను సృష్టించడం లక్ష్యం. అటు ఎమ్మెల్యేలు, ఇటు జనం కూడా తనతోనే వున్నారని రుజువైన తర్వాత సోనియాగాంధీ తనను కాదని ఎక్కడకు వెళ్తుందన్నది జగన్ అభిప్రాయం.

## కార్టూన్ స్కోప్



అబ్బే... స్వైన్ ఫ్లూ భయం కాదు... మనం నివారణ చర్యల గురించి.



వెంకటగిరిలో జరిగిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సంతాపసభలో మాట్లాడుతున్న మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి. వేదికపై ఎస్పీ మల్లారెడ్డి, ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, ఎమ్పీ రాజమోహన్‌రెడ్డి, జడ్పీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, మాదాసు గంగాధరం, ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి.

# బెంబేలెత్తిస్తున్న ఢిల్లీ మీడియా దాడి

Jagan's men persuaded families of people who died of other causes to say the deaths were a reaction to the ex-CM's tragic copter crash

**FAMILIES PAID TO CLAIM YSR SHOCK DEATHS**

ఢిల్లీ నుంచి వెలువడే మెయిల్ టుడే పత్రికలో ప్రచురితమైన వార్త తాలూకు శీర్షిక.

జగన్ ముఖ్యమంత్రిత్వం పట్ల అసలే అయిష్టంగా వున్న కాంగ్రెస్ అధిష్టానం మనసును మరింత విరిచేస్తున్నాయి ఢిల్లీ మీడియా వార్తలు. వైఎస్ చనిపోయిన మూడవరోజే పదవి కోసం జగన్ చేస్తున్న ప్రయత్నాలను నిరసిస్తూ మెయిల్ టు డే అనే ఢిల్లీ దినపత్రిక సుదీర్ఘమైన వార్తాకథనాలు ప్రచురించింది. జగన్ వ్యాపార సామ్రాజ్య విస్తరణ, అందుకోసం వేల కోట్ల రూపాయల పెట్టుబడుల సేకరణలపై పదునైన వ్యాఖ్యలు చేసింది. ఇండియా టుడే గ్రూప్ పత్రిక ఇది. పత్రికా రంగంలో ఇండియా టుడే విశ్వసనీయత ఎంత వున్నతమైనదో తెలిసిన సంగతే. ఢిల్లీ పెద్దలకు ఈ వార్తపైన సంజాయిషీ ఇచ్చుకోలేక తల ప్రాణం తోకకు వచ్చింది కెవిపి.రామచంద్రరావుకు. 16తేది ఉదయం తాజాగా మరొకసారి ఇదే పత్రిక మరొక సంచలనాత్మక వార్తను ప్రచురించింది. రాజశేఖర్‌రెడ్డి మృతిని తట్టుకోలేక వందలాది మంది ఆత్మహత్యలు చేసుకొంటున్నారని జరుగుతున్న ప్రచారం బూటకమన్నది ఆ వార్త సారాంశం. టైమ్స్ ఆఫ్ ఇండియా కూడా ఇదే కథనాన్ని ప్రచురించింది. మరొకప్రక్క ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కూడా జగన్ మీద దాడి చేస్తున్నది.

ఇంతకాలం ఈనాడు, ఆంధ్రజ్యోతిలకు మాత్రమే పరిమితమైన వ్యతిరేక ప్రచారాన్ని ఒక్కసారిగా జాతీయ మీడియా అందుకోవడంతో జగన్ శిబిరం బెంబేలెత్తిపోతున్నది. కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి ఒక పథకం ప్రకారం జాతీయ మీడియాలో తన పలుకుబడిని వాడి ఈ ప్రచారం సాగిస్తున్నాడన్నది జగన్ అనుమానం. దీనివల్ల ఢిల్లీ కాంగ్రెస్ పెద్దల దృష్టిలో తాను పలచబడిపోతున్నానని ఆవేదన చెందుతున్నాడు. కానీ ఏమీ చేయలేని పరిస్థితి. అప్పటికీ కెవిపి రామచంద్రరావు ఎన్‌డిటివీ, టైమ్స్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఆఫీసులకు వెళ్లి స్వయంగా వివరణ ఇచ్చుకొని వచ్చాడు. కానీ వారి తీరులో మార్పు రావడం లేదు. జగన్ ముఖ్యమంత్రిత్వ అవకాశాలకు ఈ వార్తలు పెను విఘాతమని భయపడుతున్నాడు కెవిపి.

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.